క్లుప్తంగా

ఎరువుల దుకాణాలు తనిఖీ



ఎరువుల దుకాణాన్ని తనిఖీ చేస్తున్న అధికారులు

కోడుమూరు రూరల్: పట్టణంలోని ఎరువులు, పురుగు మందుల దుకాణాలను గురువారం ఆదోని ఏడీఏ బాలవర్ధిరాజు, కోడుమూరు ఏఓ రవిప్రకాష్ తనిఖీ చేసి, స్టాక్ రిజిష్టర్లను పరిశీలించారు. కిసాన్ అగ్రిమాల్‌లో రికార్డులు సరిగా లేకపోవడంతో రూ.2 లక్షలు విలువ చేసే ఎరువుల విక్రయాలను నిలిపేశారు. రికార్డులతో పాటు, స్టాక్ రిజిష్టర్లు సక్రమంగా లేకపోతే దుకాణాలను సీజ్ చేస్తామని ఏడీఏ హెచ్చరించారు.

డాన్స్ మాస్టర్‌పై చర్యలు తీసుకోవాలి

ఓర్వకల్లు : మండలంలోని నన్నూరు సమీపంలోని ఓ ప్రైవేటు స్కూల్‌లో విద్యార్థినితో అసభ్యకరంగా ప్రవర్తించిన డాన్స్ మాస్టర్‌పై తక్షణ చర్యలు తీసుకోవాలని విద్యార్థి యువజన సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. గురువారం స్థానిక బుగ్గరామేశ్వర డిగ్రీ కళాశాలలో నిర్వహించిన సమావేశంలో ఆర్‌వీఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రవీంద్రనాథ్, ప్రగతిశీల యువజన సంఘం జిల్లా అధ్యక్షుడు రమేష్ మాట్లాడుతూ.. ఐదో తరగతి చదువుతున్న బాలిక పట్ల డ్యాన్స్ మాస్టర్ అసభ్యకరంగా ప్రవర్తించినట్లు తెలిపారు. ఈ విషయం తెలిసినా పాఠశాల యాజమాన్యం ఇంతవరకు అతనిపై ఏవిధమైన చర్యలు తీసుకోకపోవడం శోచనీయమన్నారు. ఇప్పటికైనా అతనిపై కేసు నమోదు చేసి, తగిన చర్యలు తీసుకోవాలని కోరారు. సమావేశంలో విద్యార్థి సంఘం నాయకులు మధు, చిన్న, రాజు, విష్ణు తదితరులు పాల్గొన్నారు.

ఆర్టీసీ బస్సుకు తప్పిన ప్రమాదం



ఆర్టీసీ బస్సుకు తగిలిన రెయిలింగ్

పాణ్యం: మండల పరిధిలోని పిన్నాపురం ఘాట్‌రోడ్‌లో మలుపువద్ద గురువారం ఉదయం విద్యార్థులతో వెళ్తున్న ఆర్టీసీ బస్సుకు రోడ్డు పక్కన ఏర్పాటు చేసిన ఇనుప రెయిలింగ్ తగిలింది. కొండ ఘాట్‌పై బస్సును డ్రైవర్ చాకచక్యంగా నిలిపి ప్రమాదాన్ని తప్పించాడు. ఇనుప దిమ్మెలు రోడ్డుపై చెల్లాచెదురుగా పడటంతో ఘాట్‌రోడ్డులో వాహనదారులు ఇబ్బందులు పడ్డారు. ఘాట్ రోడ్డులో రైలింగ్‌లు శిథిలావస్థకు చేరి రోడ్డువైపు ఒరిగిపోవడంతోనే బస్సుకు తగిలినట్లు తెలుస్తోంది. ఆర్‌అండ్‌బీ అధికారులు స్పందించి ఘాట్‌రోడ్డులోని రెయిలింగ్‌లకు మరమ్మతుల చేయించాలని ప్రయాణికులు కోరుతున్నారు.


కొనసాగుతున్న న్యాయవాదుల దీక్షలు

కర్నూలు (లీగల్): ఆంధ్రప్రదేశ్ భూ యాజమాన్య హక్కు చట్టం, జీవో నెం.512ను వెంటనే రద్దు చేయాలని ధర్నా చౌక్‌లో న్యాయవాదుల చేపట్టిన రిలే నిరాహారదీక్షలు గురువారం కొనసాగాయి. దీక్షల్లో న్యాయవాదులు వసుంధర దేవి, షభానా, సమీరా షాహిన్, సరోజ, కృష్ణ, మురళీ మోహన్, శివప్రసాద్, రేవతి, వీరా ప్రియాంక, బాషా ఖాద్రి, అబిద్ హుసేన్ కూర్చున్నారు. శిబిరానికి కాంగ్రెస్ నాయకులు కరుణాకర్ సంఘీభావం తెలిపారు.

వైద్యులు టీచింగ్ మెలకువలు నేర్చుకోవాలి

కర్నూలు(హాస్పిటల్): వైద్యులు తప్పనిసరిగా టీచింగ్ మెలకువలు నేర్చుకోవాలని కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాల సూపరింటెండెంట్ డాక్టర్ వి.వెంకటరంగారెడ్డి సూచించారు. నేషనల్ మెడికల్ కౌన్సిల్ నిబంధనల మేరకు గురువారం మెడికల్ కాలేజీలోని మెడికల్ ఎడ్యుకేషన్ యూనిట్‌లో వైద్యులకు మూడు రోజుల బీసీఎంఈ కోర్సు నిర్వహించారు. బోధనలో నైపుణ్యాలతో పాటు కమ్యూనికేషన్ స్కిల్స్ పెంచుకునేలా శిక్షణ ఇస్తారన్నారు. కార్యక్రమంలో ఎస్ఎంసీ అబ్జర్వర్ డాక్టర్ శృతి, ఎస్పీఎం ప్రొఫెసర్ డాక్టర్ సింధియా తదితరులు పాల్గొన్నారు.

కర్నూలు చేరుకున్న అయోధ్య రాముడి రథయాత్ర



కర్నూలు(సెంట్రల్): దేశంలోని అన్ని నదుల జలాలు, మట్టిని సేకరించే ఉద్దేశంతో ప్రారంభమైన అయోధ్య రాముడి రథయాత్ర గురువారం కర్నూలు చేరుకుంది. అయోధ్యలోని రామమందిరం నుంచి బయలుదేరిన ఈ రథయాత్ర తిరిగి అక్కడికే వెళ్తుంది. ఈక్రమంలో గురువారం కర్నూలు జిల్లా చేరుకోవడంతో ధార్మిక సంఘాల ప్రతినిధులు ధార్మిక నాగేశ్వరరావు, మురళీ, మహాబలేష్, నాగోజీరావు, లక్ష్మయ్య స్వాగతం పలికారు. నగరం సమీపంలోని తుంగభద్ర జలాలు, మట్టిని సేకరించి వారికి అందజేశారు.

రాకపోకలు రయ్..రయ్!

రహదారుల అభివృద్ధికి రూ.కోట్లు ఖర్చు చేసిన ప్రభుత్వం
- మెరిసిపోతున్న గ్రామీణ రహదారులు
- సంతోషం వ్యక్తం చేస్తున్న ప్రజలు



పల్లె రోడ్లు మెరిసిపోతున్నాయి. వాహనదారులు ఇప్పుడు రయ్..రయ్ మంటూ దూసుకెళ్తున్నారు. ఒకప్పుడు గతుకుల రోడ్లపై రాకపోకలంటేనే నరకప్రాయంగా భావించే పల్లె ప్రజలు ప్రస్తుతం ఎలాంటి ఇబ్బందులు లేకుండా ప్రయాణాన్ని సాఫీగా సాగిస్తున్నారు. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధికారం చేపట్టిన తర్వాత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి రహదారుల నిర్మాణాలపై ప్రత్యేక దృష్టి సారించారు. నియోజకవర్గానికి రూ.కోట్లు వెచ్చించడంతో రహదారుల రూపురేఖలే మారిపోయాయి. – గూడూరు



రూ.10 కోట్లతో నిర్మించిన గూడూరు -పెద్దనెలటూరు బీటీ రహదారి



రూ.6 కోట్లతో నిర్మించిన గూడూరు- మల్లాపురం బీటీ రహదారి



రూ.5 కోట్లతో నిర్మించిన గూడూరు - ఆర్.ఖానాపురం బీటీ రహదారి

- కోడుమూరు మండలంలో రూ.5 కోట్లు వెచ్చించి కోడుమూరు– ముల్లగుర్తి వరకు 6 కి.మి. బీటీ రహదారి అభివృద్ధి చేసింది.
- సి.బెళగల్ మండలంలో రూ.3 కోట్లు ఖర్చు చేసి జులకల్లు– బ్రాహ్మణదొడ్డి 3 కి.మీ.గ్రామానికి బీటీ రహదారి నిర్మించింది.
- గూడూరు మండలంలో రూ.10 కోట్లు ఖర్చు చేసి గూడూరు నుంచి పులకుర్తి, పెద్దనెలటూరు వరకు 15 కి.మీ. బీటీ రహదారిని నిర్మించింది. ఈ రహదారి నిర్మాణంతో అటు కోడుమూరు, ఇటు గోనెగండ్ల మండలాల ప్రజలకు ఎంతగానో మేలు జరిగింది. రెండు మండలాల మధ్యరాకపోకలు మెరుగుపడ్డాయి.

గతంలో గుంతలకు మట్టి కూడా వేయలేదు



టీడీపీ ప్రభుత్వం అధికారంలో ఉన్నప్పుడు పులకుర్తి రహదారిలో గుంతల్లో మట్టి కూడా వేయలేదు. తీవ్ర ఇబ్బందులు పడుతూ రాకపోకలు సాగించేవాళ్లం. వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చిన తరువాత రహదారిని బాగుచేశారు. వ్యవసాయ పనులు చేసుకోవడానికి ఈ రహదారి చాలా ఉపయోగపడుతోంది.
– గిడ్డయ్య, గూడూరు

రహదారులు బాగుపడ్డాయి



వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చిన తరువాత గ్రామీణ రహదారుల దశ మారింది. గూడూరు నుంచి కొత్తకోట రహదారి ఎంతో అధ్వానంగా ఉండేది. రహదారిని బాగు చేసి ప్రజల కష్టాలు తీర్చిన ఘనత జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వానికే దక్కుతుంది. – భాస్కర్, గూడూరు

- రూ.7 కోట్లు ఖర్చు చేసి గూడూరు– కొత్తకోట వరకు 10 కి.మి.బీటీ రహదారిని అభివృద్ధి చేసింది. దశాబ్దాల నుంచి ఈ రహదారి అభివృద్ధిపై వాగ్దానాలు చేసిన టీడీపీ ప్రభుత్వం విస్మరించడంతో వైఎస్సార్‌పీ అధికారంలోకి వచ్చిన వెంటనే రహదారిని నిర్మించి మూడు గ్రామాల ప్రజల ప్రయాణ కష్టాలు తీర్చింది.
- రూ.5 కోట్లు ఖర్చు చేసి గూడూరు - ఆర్.ఖానాపురం వరకు 5 కి.మి. బీటీ రహదారిని నిర్మించింది.
- రూ.2 కోట్లు ఖర్చు చేసి కే.నాగులాపురం– బూడిదపాడు వరకు 2 కి.మి. బీటీ రహదారిని ఏర్పాటు చేసి పల్లె వాసులు కష్టాలు తీర్చింది.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

కర్నూలు(అగ్రికల్చర్): విద్యుత్ సరఫరాలో శుక్రవారం అంతరాయం ఉంటుందని కర్నూలు ఈఈ (ఆపరేషన్) పి.ఓబులేసు గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. జొహరాపురంలోని విద్యుత్ లైన్ మార్పు చేసే పనుల నిమిత్తం ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు సరఫరా నిలిపివేస్తున్నామన్నారు. లక్ష్మీగార్డెన్స్, మారుతీహోమ్స్, హార్ట్ అండ్ బ్రెయిన్ సెంటర్, సూర్య హాస్పిటల్, ఎల్‌బీజీ నగర్, ఇంటెలిజెన్స్ బ్యూరో ఆఫీసు ఏరియా, జొహరాపురం రోడ్డు పరిసరాల్లో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని వినియోగదారులు గమనించి సహకరించాలని కోరారు.

జనవరి 3న మహిళా టీచర్స్ డే నిర్వహించాలి

కర్నూలు సిటీ: సావిత్రి బాయిఫూలే జయంతిని పురస్కరించుకుని జనవరి 3న మహిళా టీచర్స్ డే నిర్వహించాలని బహుజన టీచర్స్ అసోసియేషన్ గౌరవ అధ్యక్షులు డి.రామశేషయ్య, నాయకులు బి.సుధాకర్, తదితరులు గురువారం డీఈఓ డా.వి రంగారెడ్డికి వినతి పత్రం అందజేశారు.

రక్తదాన శిబిరం

కర్నూలు(హాస్పిటల్): డేనియల్ రాజు ఫౌండేషన్ ఆధ్వర్యంలో స్థానిక బాలాజీ నగర్‌తో పాటు తాడిపత్రి, అనంతపురం, విజయవాడ, హైదరాబాద్, గద్వాల, ఆదోని, నంద్యాలలోనూ రక్తదాన శిబిరాలు ఏర్పాటు చేసినట్లు వ్యవస్థాపకులు సుమన్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆపదలో ఉన్న వారి ప్రాణాలు కాపాడాలన్న ఆలోచనతో తలపెట్టిన ఈ కార్యక్రమానికి విశేష స్పందన లభించిందన్నారు.

పశువుల్లో కృత్రిమ గర్భధారణపై అవగాహన



మాట్లాడుతున్న నంద్యాల ఉప సంచాలకులు డాక్టర్ రమణమూర్తి

గడివేముల: పశువులలో యద లక్షణాలను గుర్తించి వాటికి కృత్రిమ గర్భధారణ చేయించే యాజమాన్య పద్ధతులపై రైతులకు నంద్యాల ఉప సంచాలకులు డాక్టర్ రమణమూర్తి, డీఎల్‌డీఏ ఎగ్జిక్యూటివ్ అధికారి డాక్టర్ రాజశేఖర్ అవగాహన కల్పించారు. గురువారం స్థానిక పశువైద్యశాలలో రైతులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. వారు మాట్లాడుతూ ముర్రు జాతి పాడి పశువులలో కృత్రిమ గర్భధారణ ద్వారా త్వరితగతిన పాడి పశువులు అభివృద్ధి చెందుతాయన్నారు. ప్రభుత్వం పాడి రైతులను ప్రోత్సహించేందుకు అనేక పథకాలు ప్రవేశపెట్టిందని చెప్పారు. పాడి పోషకులు పశువులకు లింగ నిర్ధారణ పరీక్షల ద్వారా కృత్రిమ గర్భధారణపై అవగాహన కలిగి ఉండాలన్నారు. లింగ నిర్ధారణ ద్వారా పాడిపశువులకు ఎద్ర సూదులను ప్రభుత్వం సబ్సిడీపై రూ.500 ఇస్తుందని తెలిపారు. ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు.అనంతరం పాడి రైతులను ప్రోత్సహించేందుకు ఉచితంగా ఎముకలపొడి, కాల్షియం టానిక్‌లను అందజేశారు. లేక దూడలలో నట్టల నివారణకు దూడ పుట్టిన ఏడవ, 15వ, 30వ రోజు కచ్చితంగా నివారణ మందులు వేయాలన్నారు. కార్యక్రమంలో డాక్టర్ సాయి హరిణి, డాక్టర్ బాబా ఫకృద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

పేదలందరికీ సంక్షేమ పథకాలు



సంక్షేమ పథకాలను వివరిస్తున్న ఎంఈఓ ఆదామ్ బాషా

సి.బెళగల్: అర్హులైన పేదలందరికీ సంక్షేమ ఫలాలను అందించేందుకు రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాలు కృషి చేస్తున్నాయని ఇన్‌చార్జ్ ఎంపీడీఓ శ్రీనివాసులు అన్నారు. గురువారం మండలంలోని సి.బెళగల్, గొల్లలదొడ్డి గ్రామాలలో వికసిత్ భారత్ సంకల్ప యాత్ర నిర్వహించారు. కార్యక్రమంలో పథకాలపై మండల అధికారులు అవగాహన కల్పించారు. ఇన్‌చార్జ్ ఎంపీడీఓ శ్రీనివాసులు, పీహెచ్‌సీ డాక్టర్ మిథున్‌కుమార్‌రెడ్డి, హౌసింగ్ వర్క్ ఇన్‌స్పెక్టర్ రంగన్న, విద్యా అంశాలను ఎంఈఓ ఆదామ్‌బాషా ఆయా శాఖల పథకాలను వివరించారు. వ్యవసాయంలో డ్రోన్ వినియోగంపై ఏఓ మల్లేష్‌కుమార్ అవగాహన కల్పించారు. కార్యక్రమంలో సి.బెళగల్ సర్పంచ్ పాండురంగన్న, బీజేపీ నాయకులు ప్రేమ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఉచిత ప్రయాణం హామీపై ఆటో కార్మికుల ధర్నా



కోడుమూరు తహసీల్దార్ కార్యాలయం ముందు ధర్నా నిర్వహిస్తున్న ఆటో కార్మికులు

కోడుమూరు: మహిళలకు ఆర్‌టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణమంటూ ఇస్తున్న హామీని విరమించుకోవాలంటూ గురువారం కోడుమూరులోని తహసీల్దార్ కార్యాలయం ఎదుట ఏఐటీయూసీ ఆధ్వర్యంలో ఆటో కార్మికులు ధర్నా నిర్వహించారు. ఆటో కార్మికులు మాట్లాడుతూ 2024 ఎన్నికల్లో మహిళల ఓట్లు రాల్చుకోవాలన్న ఉద్దేశంలో తెలుగుదేశం పార్టీ ఉచిత బస్సు ప్రయాణమంటూ హామీలు గుప్పిస్తోందన్నారు. తద్వారా వేలాదిమంది ఆటో కార్మికుల కుటుంబాలు రోడ్డున పడే ప్రమాదముందని వాపోయారు. రాష్ట్రంలో లక్షలాది మంది ఆటోలను నమ్ముకుని జీవనం సాగిస్తున్నారనే విషయాన్ని ఆ పార్టీ గుర్తుంచుకోవాలన్నారు. ఇప్పటికే కర్ణాటక, తెలంగాణ రాష్ట్రాల్లో ఉపాధి కోల్పోయి ఆటో కార్మికులు రోడ్డున పడ్డారని, వెంటనే హామీని విరమించుకోవాలని వారు డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ నియోజకవర్గ అధ్యక్షుడు చిన్న రాముడు, సీపీఐ మండల కార్యదర్శి రాజు, ఆటో వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు మధు, ఆటో కార్మికులు పాల్గొన్నారు.

క్రమశిక్షణతో చదివి ఉద్యోగాలు సాధించాలి

కర్నూలు (అర్బన్): విద్యార్థులు క్రమశిక్షణతో కష్టపడి చదివి మంచి ఉద్యోగాలు సాధించాలని జిల్లా రెవెన్యూ అధికారి కే మధుసూదనరావు కోరారు. స్థానిక బీసీ స్టడీ సర్కిల్‌లో జిల్లాలోని బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీ వర్గాలకు చెందిన అభ్యర్థులకు గ్రూప్ –2 (ప్రిలిమనరీ) పరీక్షలకు సన్నద్ధం అయ్యేందుకు ఏర్పాటు చేసిన శిక్షణా తరగతులను గురువారం ఆయన ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. బీసీ స్టడీ సర్కిల్ డైరెక్టర్ పీ వెంకటలక్ష్మమ్మ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ.. పట్టుదల ఉంటే ఏదైనా సాధ్యమవుతుందన్నారు. శిక్షణ తీసుకుంటున్న వారు ఒక ప్రణాళిక ప్రకారం చదవాలన్నారు. ప్రైవేట్ కోచింగ్ సెంటర్లలో వేలకు వేల రూపాయలు ఫీజుల రూపంలో చెల్లించి తీసుకునే శిక్షణను రాష్ట్ర ప్రభుత్వం పేద, మధ్య తరగతి వర్గాలకు ఉచితంగా అందిస్తోందన్నారు. స్టడీ సర్కిల్ డైరెక్టర్ పీ వెంకటలక్ష్మమ్మ మాట్లాడుతూ ప్రభుత్వం అందిస్తున్న ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. బీసీ స్టడీ సర్కిల్‌లో శిక్షణ పొందిన వారు మెయిన్ పరీక్షకు ఎంపిక కావాలని కోరారు. 45 రోజుల శిక్షణా సమయంలో అభ్యర్థులకు మెటీరియల్ అందజేస్తామని, శిక్షణ పూర్తి అయిన అనంతరం అర్హులైన వారికి ప్రభుత్వం స్టైఫండ్ ఇస్తుందన్నారు. ఇప్పటి వరకు 232 దరఖాస్తులు రాగా, 80 మంది అభ్యర్థులు ప్రవేశం పొందారన్నారు. డ్రైనీ బీసీ సంక్షేమ సాధికారత అధికారి భరత్‌కుమార్‌రెడ్డి మాట్లాడుతూ శిక్షణ తీసుకుంటున్న వారు ఉన్నత స్థితికి రావాలన్నారు. కార్యక్రమంలో స్టడీ సర్కిల్ కోర్సు కో ఆర్డినేటర్ బీ విజయ భాస్కర్, లైబ్రేరియన్ యుగంధర్‌గౌడ్, సిబ్బంది ఎండీ బాషా తదితరులు పాల్గొన్నారు.

భవన నిర్మాణ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

కర్నూలు(సెంట్రల్): భవన నిర్మాణ కార్మికుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి ఎండీ అంజిబాబు డిమాండ్ చేశారు. గురువారం సీఐటీయూ ఆధ్వర్యంలో కలెక్టరేట్ ఎదుట భవన నిర్మాణ కార్మికులు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భవన నిర్మాణ కార్మికుల సంక్షేమ బోర్డు నుంచి రూ.850 కోట్లను దారి మళ్లించారని, నిధులను తిరిగి సంక్షేమ బోర్డుకు జమ చేయాలన్నారు.

మెగా డీఎస్సీని విడుదల చేయాలి

కర్నూలు(సెంట్రల్): ఉపాధ్యాయ పోస్టుల భర్తీ కోసం మెగా డీఎస్సీని విడుదల చేయాలని డీవైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి వై.నగేష్ డిమాండ్ చేశారు. గురువారం కలెక్టరేట్ ఎదుట నిరుద్యోగులతో కలిసి డీవైఎఫ్ఐ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ 2018 నుంచి ఇప్పటి వరకు డీఎస్సీని విడుదల చేయలేదన్నారు. అధికారంలోకి వచ్చిన వెంటనే ఉపాధ్యాయ పోస్టులను భర్తీ చేస్తామన్న ప్రభుత్వం పట్టించుకోకపోవడంతో ఎంతో మంది నిరుద్యోగులు వేచి ఉన్నారన్నారు. జాబ్ క్యాలెండర్ అమలు చేసినా అందులో డీఎస్సీ లేకపోవడం అన్యాయన్నారు. కార్యక్రమంలో నాయకులు రాఘవేంద్ర, హుస్సేన్‌బాషా, గోవర్ధన్, వీరేష్ పాల్గొన్నారు.

పరీక్ష ఫీజు చెల్లింపునకు 2వ తేదీ వరకు గడువు

తుగ్గలి: వచ్చే మార్చిలో నిర్వహించనున్న 10వ తరగతి పబ్లిక్ పరీక్షలు రాసే విద్యార్థులు ఫీజు చెల్లించేందుకు జనవరి 2వ తేదీ వరకు మాత్రమే గడువు ఉందని ఎంఈఓ–2 రామవెంకటేశ్వర్లు గురువారం తెలిపారు. అన్ని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల హెచ్‌ఎంలు తమ పరిధిలో పరీక్షలకు హాజరయ్యే విద్యార్థులకు ఈ విషయం తెలిపి రూ.500 అపరాధ రుసుముతో ఫీజు చెల్లించేలా చర్యలు తీసుకోవాలన్నారు.

- ప్రతి విద్యార్థి ఉన్నత చదువులు చదవాలన్నదే జగనన్న లక్ష్యం
- ఎమ్మెల్యే డాక్టర్ సుధాకర్
- కోడుమూరులో విద్యార్థులకు ట్యాబ్‌ల పంపిణీ

విద్యతోనే ఉజ్వల భవిష్యత్



విద్యార్థులకు ట్యాబ్‌లను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ సుధాకర్

కోడుమూరు రూరల్ : విద్యతోనే విద్యార్థులకు ఉజ్వల భవిష్యత్ ఉంటుందని, ప్రతి పేద విద్యార్థి ఉన్నత చదువులు చవవాలన్న లక్ష్యంతో రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పనిచేస్తున్నారని కోడుమూరు ఎమ్మెల్యే డాక్టర్ సుధాకర్ తెలిపారు. గురువారం కోడుమూరులోని మోడల్ స్కూల్, కస్తూర్బా పాఠశాలలకు చెందిన 8వ తరగతి విద్యార్థులకు మంజూరైన బైజుస్ ట్యాబ్‌లను ఎమ్మెల్యే డాక్టర్ సుధాకర్ చేతుల మీదుగా పంపిణీ చేశారు. ఆయా పాఠశాలల పాఠశాలల ప్రిన్సిపాళ్లు ఆశాజ్యోతి, గౌసియాబేగంల ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ.. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పేద విద్యార్థులంతా ఉన్నత చదువులు చదవాలన్న లక్ష్యంతో నాడు–నేడు ద్వారా ప్రభుత్వ పాఠశాలలను అభివృద్ధి చేయడంతో పాటు, అమ్మ ఒడి, జగనన్న విద్యా దీవెన, విద్యా వసతి వంటి పథకాలను ప్రవేశ పెట్టారన్నారు. ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలను విద్యార్థులంతా సద్వినియోగం చేసుకుని ఉన్నతంగా ఎదగాలని ఆకాంక్షించారు. ప్రభుత్వం అందజేస్తున్న ట్యాబ్‌ల ద్వారా నాలెడ్జ్‌ను పెంపొందించుకోవాలన్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ చంద్రశేఖర్, ఎంఈఓ శరభయ్య, సర్పంచు బాలకృష్ణ, వైఎస్సార్ సీపీ లీగల్ సెల్ ఇన్‌చార్జ్ లాయర్ ప్రభాకర్, నాయకులు అద్దుగల రాజశేఖరరెడ్డి, ప్రతాప్‌రెడ్డి, ఏకాంబరం, బలరాం తదితరులు పాల్గొన్నారు.

పేద మహిళలకు చీరల పంపిణీ

కర్నూలు(హాస్పిటల్): క్రిస్మస్, నూతన సంవత్సరాన్ని పురస్కరించుకుని స్థానిక బుధవారపేటలోని పేద మహిళలకు గ్యాస్ట్రో ఎంట్రాలజిస్టు డాక్టర్ బి.శంకరశర్మ చీరలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రపంచంలో ఏ దేశంలో లేని విధంగా భిన్నమతాలు, భిన్న సంస్కృతులు మన దేశంలో ఉన్నాయని, ఇది ప్రపంచానికి ఆదర్శప్రాయమన్నారు. ఎవరు ఏ మతంలో ఉన్నా ఇతరుల మతాన్ని గౌరవించాలన్నారు.

గోదాగోకులంలో తిరుప్పావడ సేవ

కర్నూలు(సెంట్రల్): గోదా గోకులంలో గురువారం ఉదయం 10 గంటలకు స్వామి వారికి తిరుప్పావడ సేవను నిర్వహించారు. పూజారి నాగరాజు ఆధ్వర్యంలో పులిహోరను రాశిగా పోసి ఒక రూపం లాగా తయారు చేస్తారు. దద్ధోజనం, వడలు, అప్పాలు, లడ్డూలతోపాటు పలు రకాల వంటకాలను స్వామికి సమర్పించారు. ఈ సేవను అన్నకూటోత్సవం అని అంటారని పూజారి నాగరాజు అన్నారు. ధనుర్మాసంలో ఒక గురువారం ఈ సేవను పాటిస్తే మంచిదని ఆయన వివరించారు.



పార్కులో ఏర్పాటు చేసిన వాటర్ ఫౌంటెన్



కనువిందు చేస్తున్న పక్షులు, జంతువుల బొమ్మలు

వనం.. అపు'రూపం'..!

అలజడి విని పరుగులు తీసేందుకు సిద్ధంగా ఉన్న ఉడుతలు.. గొంతెత్తి చూస్తున్న జిరాఫీలు.. అప్రమత్తమైన కొంగలు.. సుద్దులు చెబుతున్న తల్లి కుందేలు వద్ద చెవులు నిక్కపొడిచి వింటున్న పిల్ల కుందేలు.. పింఛం విదిల్చి పైకెగురుతున్నట్లున్న నెమలి.. నేల నుంచి నింగికెగిసి పడుతున్న నీటి ధారలు.. ఇవే కాదు మిరిమిట్లు గొలిపే లైట్లు.. జీవం ఉట్టి పడేలా జంతువుల బొమ్మలు కర్నూలు మహా నగరం నడిబొడ్డున శ్రీపొట్టి శ్రీరాములు చిల్డన్స్ పార్క్‌లో కనువిందు చేసే దృశ్యాలు. రూ.1.20 కోట్లు వెచ్చించి పార్క్‌ను సుందరంగా తీర్చిదిద్దారు. శుక్రవారం ప్రారంభానికి నగరపాలక ఇంజినీరింగ్ అధికారులు ఏర్పాట్లు పూర్తి చేశారు. ఫైబర్‌తో తయారు చేసిన చెట్లు, మొక్కలు, కుందేలు, జింక, పక్షులు, రంగు రంగుల లైట్లతో వాటర్ ఫౌండేన్లు సినిమా సెట్టింగ్‌ను తలపిస్తున్నాయి. చిన్నారుల కోసం ఊయల, జారుడు బండ ఏర్పాటు చేశారు. తామర పువ్వులు అబ్బురపరుస్తున్నాయి. చిన్న, చిన్న పార్టీలు, బర్త్‌డే ఫంక్షన్లు, కిటీ పార్టీలు చేసుకునేందుకు వీలుగా ప్రత్యేకంగా ఏర్పాటు చేశారు.



పిల్లలు ఆడుకునేందుకు జారుడు బల్లలు

– సాక్షి ఫొటోగ్రాఫర్, కర్నూలు

హోరాహోరీగా 'ఆడుదాం.. ఆంధ్ర' పోటీలు



ఏపీ మోడల్ స్కూల్ వద్ద వాలీబాల్ ఆడుతున్న యువకులు



క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న డీఏబీ చైర్మన్ మహేశ్వర్‌రెడ్డి

పాణ్యం: ఆడుదాం–ఆంధ్ర క్రీడా పోటీలు పాణ్యం, కోడుమూరు నియోజకవర్గాల్లో హోరాహోరీగా సాగుతున్నాయి. గురువారం పలు చోట్ల పోటీలు రసవత్తరంగా సాగాయి. ఐదు క్రీడాంశాల్లో నువ్వానేనా అన్నట్లు క్రీడాకారులు తలపడ్డారు. పాణ్యం ప్రభుత్వ పాఠశాల మైదానంలో క్రికెట్ పోటీలు నిర్వహించారు. 4 సచివాలయాల పరిధిలోని క్రీడాకారులు తమ ప్రతిభను చాటుకున్నారు.

క్రీడాలతో మానసిక ఉత్సాహం

కల్లూరు: క్రీడాల వల్ల మానసిక ఉత్సాహం, శారీరక దృఢత్వం పెరుగుతుందని జిల్లా వ్యవసాయ సలహామండలి చైర్మన్ మహేశ్వర్‌రెడ్డి అన్నారు. గురువారం కల్లూరు అర్బన్ 47వ వార్డు సచివాలయం పరిధిలో జరుగుతున్న ఆడుదాం ఆంధ్ర క్రీడాలను ఆయన ప్రారంభించి మాట్లాడారు. గెలుపు ఓటములను సమానంగా స్వీకరించాలని క్రీడాకారులకు సూచించారు.

- కల్లూరు మండలం బొల్లవరం గ్రామంలో జరిగిన క్రీడలను ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ శ్రీనాథ్‌రెడ్డి పరిశీలించారు. క్రీడల్లో పాల్గొని క్రీడాకారులను ఉత్సాహపరిచారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి బిందుభార్గవి పాల్గొన్నారు.

బోణీ కొట్టిన కాల్వబుగ్గ

ఓర్వకల్లు: మండలంలోని కాల్వబుగ్గ గురుకుల పాఠశాల మైదానంలో ఆడుదాం ఆంధ్ర క్రీడా పోటీలు ఉత్సాహంగా సాగాయి. ఎంపీడీఓ శివనాగప్రసాద్ బ్యాటింగ్ చేసి క్రికెట్ పోటీలను ప్రారంభించారు. సోమయాజులపల్లె – కాల్వబుగ్గ గురుకుల పాఠశాల యువకులు పోటీలో తలపడగా కాల్వబుగ్గ గురుకుల పాఠశాల జట్టు విజయం సాధించింది. కార్యక్రమంలో ఏపీఆర్ స్కూల్ ప్రిన్సిపాల్ ప్రసాద్ రావు, పంచాయతీ కార్యదర్శి లక్ష్మీకాంతారెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు సోమయాజులపల్లె మదన్ వెంకటరెడ్డి, చెన్నంశెట్టిపల్లె కృష్ణారెడ్డి, కొమరోలు నాగశేషులు పాల్గొన్నారు.

అట్టహాసంగా క్రీడా సంబరాలు

సి.బెళగల్: మండల కేంద్రంలో ఆడుదాం ఆంధ్ర క్రీడా పోటీలు అట్టహాసంగా సాగాయి. మూడో రోజు కబడ్డీ, క్రికెట్ పోటీలు నిర్వహించారు.



క్రికెట్ పోటీలను ప్రారంభిస్తున్న ఎంపీడీఓ శివనాగప్రసాద్



కబడ్డీలో తలబడుతున్న క్రీడాకారులు